తెలంగాణ ప్రభుత్వం

# పౌరసరఫరాల శాఖ కార్యాలయం

సోమాజిగూడ, హైదరాబాద్ 500082

పత్రిక ప్రకటన : తేదీ : 10.08.2018

## జీవ ఇంధనాన్ని ప్రోత్సహిద్దాం
## సహజ వనరులను కాపాడుకుందాం
## పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్

పెట్రోల్, డీజిల్, బొగ్గువంటి శిలాజ ఇంధనాల లభ్యతకున్న పరిమితులను దృష్టిలో పెట్టుకుని, సహజ వనరులను కాపాడడానికి, పర్యావరణంలో కాలుష్యాన్ని తగ్గించడానికి, వాటికి ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాల (బయో ఫ్యూల్)ను ప్రోత్సహించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ అకున్ సబర్వాల్ అన్నారు.

'ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం' సందర్భంగా హెచ్.పి., ఇండియన్ ఆయిల్, భారత్ ఆయిల్ కంపెనీలు శుక్రవారం నాడు సంజీవయ్య పార్కు వద్ద నిర్వహించిన సైకిల్ ర్యాలీలో కమిషనర్ అకున్ సబర్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ, ప్రపంచంలో అత్యధిక వృద్ధి రేటు సాధిస్తున్న మనదేశం మున్ముందు మరింత వేగంగా ఆర్థిక అభివృద్ధిని సాధించబోతుంది. ఈ నేపథ్యంలో ఇంధన వినియోగం కూడా భారీగా పెరగబోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాన్ని ప్రోత్సహించవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు.

జీవ ఇంధనాల వాడకం వల్ల చాలా ప్రయోజనాలున్నాయని, వాటిని అవసరం మేర సృష్టించవచ్చని అన్నారు. సులభంగా వాతావరణంలో కలిసిపోగల లక్షణాలు గలవి, పర్యావరణ హితమైనవి, శిలాజ ఇంధనాల దిగుమతికి అవుతున్న భారీ వ్యయం కూడా తగ్గించవచ్చని, రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చి, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కూడా పెంచవచ్చని అన్నారు. బయో ఇంధనం వల్ల సహజ వనరులను కాపాడుకోవడమే కాకుండా, పర్యావరణ కాలుష్యం సైతం తగ్గుతుందని అన్నారు.

పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి జారీచేయబడినది